
# తోటకూర నాడయినా చెప్పకపోతే

పేపరు కింద పెట్టానంటున్నావ్... అటూ యిటూ జరిగిందేమో... యింకోసారి వెతుకు..."

"మీరు చెప్పే వరకూ ఆగను కదా! లక్షసార్లు వెతికాను... లేదు కాబట్టే అడుగుతున్నాను. మీరూ తియ్యలేదు కాబట్టి మిగిలింది

## గంటి భానుమతి



ఆయన జీవితం వడ్డించిన విస్తరి కాదు. కావాల్సింది వడ్డించుకునే లాంటి జీవితంకూడా కాదు. విస్తట్లో ఏం ఉంటే దానితో తృప్తి పడే రకం. పెద్ద కోరికలు లేవు. ఆశలూ లేవు. రియాక్షన్ తక్కువ. నిరాసక్తత ఎక్కువ. జీవితం జీవించడానికి, ఎలాంటి మార్పులొచ్చినా ఆహ్వానించాల్సిందే. ఇది ఆయనకి తెలిసిన భాష. అందులో వేదాంతం పాలు కొంచెం ఉంటుంది.

ఆయనపేరు ఉమామహేశ్వర్రావు

ఓ పెద్ద ఆసుపత్రిలో చిన్న ఉద్యోగం.

ఎన్నో భయంకరమైన చావులు, శవాలు చూసిన ఆయన తనతో పనిచేసే నర్సిమ్మూర్తి హఠాత్తుగా పోయాడని తెలిస్తే, అతనింటికి వెళ్ళి, అక్కణ్నుంచి స్మశానానికెళ్ళి ఇంటికొచ్చే సరికి ఐదు దాటింది. క్షణికమైన జీవితం, దాని చుట్టూ ఉన్న మాయల్ని తల్చు కుంటున్న కొద్దీ వైరాగ్యం పెరిగింది. అంతా మిథ్య... అంతా మాయ.... అనుకుంటూ యింటికొచ్చారు.

గుమ్మంలోనే ఎదురయింది భార్య పార్వతి.

"వచ్చారా ! మీ కోసమే చూస్తున్నా..." ఆందోళనగా అంది. ఏం అని కానీ, ఎందుకు అని కానీ ఆయన అనలేదు. అనే స్థితిలో లేరు. నిశ్శబ్దంగా చెప్పులు వదిలారు. బాత్రూంవైపు నడిచారు. "పొద్దున్న డబ్బేమయినా తీసారా!" భర్త వెనకాలే నడుస్తూ అంది. ఒక్క క్షణం ఆగి, ఆమె మొహంలోకి చూసారు.

"డబ్బా! ఎక్కణ్ణించి?" నిర్వి కారంగా అన్నారు. శ్మశాన వైరాగ్యం యింకా పోలేదు.

"ఎక్కడి నుంచేవిటి? నేను ఎప్పుడు పెట్టే చోటు నుంచి. వంటింట్లోని అలమారలో, డబ్బాల కింద పరచిన పేపరు కాగితాల మడతల్లోంచి. పదా, ఇరవయ్యా... ఏకంగా వంద రూపాయలు.. నోటు... నెలాఖరు రోజులు.... ఎలాగో.... అంటూనే, లుంగీ పంచ, బాత్రూంలోని రాడ్మీద వేసింది.

నిశ్శబ్దంగా పాంటు, షర్టు, బనీను అన్నీ కూడా బాత్రూంకి బయట ఉన్న బక్కెట్లో పడేసి బాత్రూంలోకి వెళ్ళారు.

"మీరు తియ్యరన్న సంగతి నాకు తెలుసు. అయినా ఏదైనా అవసరానికి తీసారేమో అని....."

వినిపించుకోనట్లు కల్లో నడుస్తున్నట్లుగా, తల తుడుచు కుంటూ బాత్రూం దాటి, వంటిల్లు దాటి, ముందుగదిలోకి వచ్చారు.

"ఇంకా వారం రోజులు గడవాలి. అప్పటిదాకా ఏదో కాలక్షేపం చేద్దామన్నా కష్టమే. అయినా ఆ డబ్బుని మీరూ తియ్యక, నేనూ తియ్యకపోతే ఏమై ఉంటుంది?

మామూలు ప్రపంచంలోకి ఆయన మనస్సు ప్రయత్ని స్తోంది.

"ఊరికే కంగారు పడకు.... నన్ను కంగారుపెట్టకు.

రాఘవ.. వాడు తీసాడేమో..."

వైరాగ్యం టక్కున వదిలింది. 'ఆఁ... ఏదో తీసాడేమో అని వేదాంతిలాగా అనలేకపోయారు.

"రాఘవా!" ఉలిక్కిపడ్డారు. "ఛ.... వాడా.... వాడెందుకు తీస్తాడు? అంటూనే లుంగీ మీద టీ షర్టు వేసుకుని కూర్చున్నారు.

"నాక్కూడా వాడిని అనుమానించాలని లేదు. కానీ...తప్పదం లేదు. యిదివరకు మీతో అనలేదు కానీ, చాలాసార్లు, పది యిరవయిలు కనపడలేదు. ఏదోలే...చూసి చూడనట్లుంటే సరి, ఏదైనా కొనుక్కుందా మని పించిందేమో అని అనుకుని అడగలేదు.... కానీ.... యివ్వాళ... " బెంగగా అంది.

ఈ అనుభవం కొత్తది. ఎందుకంటే రాఘవకి ముందు ఓ పన్నెండేళ్ళు పెద్దది శాంత ఉంది. అసలు అది ఉన్న జాడే కనపడదు. ప్రస్తుతం అది ఢిల్లీలో పిల్లా పాపలతో సుఖంగా ఉంది.

ఈ అనుభవం ఆయన్ని కొత్త ఆలోచనల వైపు మళ్ళించింది. ఆలోచనా విధానం మారింది. దానితో భావం, పదాలు, భాష మారింది.

రాఘవ పదోక్లాసు వరకూ బుద్ధిమంతుడనే పేరు తెచ్చు కున్నాడు. ఇంటర్‌లోనే వాడి ఆలోచనలు, భావాలు, భాష మారి ఉంటుంది.

ఓ పదిహేడేళ్ళ కుర్రాడు యింట్లో డబ్బులు తీస్తుంటే ఈ వయసులో సహజం అని అనుకోవాలా! సహజం అంటే.... కొంచెం పెద్దయ్యాకా చెయ్యరని అర్థమా! కానీ... పెద్దయ్యాకా కూడా చేస్తే... దొంగ అయిపోతాడా !

ఈ బాధ పోయిన వంద గురించి కాదు. ఓసారి చేసిన వాడు మరోసారి చెయ్యకపోవచ్చు. కానీ, యిది మొదటిసారి కాదు అని పార్వతి మాటల్ని బట్టి అర్థం అవుతోంది. రెండు మూడుసార్లు చేసినవాడు మరోసారి చెయ్యడానికే ఆస్కారం ఎక్కువ.

తల బరువెక్కింది. ఏం చేయాలి? ఓసారి రాజారావు దగ్గరికెళ్తే... టీ తాగి తయారయ్యారు.

"బయటి కెళ్తున్నారా ! వర్షం వస్తోంది....."

"రాజారావు దగ్గరికే.... అయినా గొడుగియ్యి... మధ్యలో ఎక్కువయితే...."

"కొంచెం.... వాడి సంగతి చూడండి. అందరూ మిమ్మల్ని ధర్మరాజు, శ్రీరామచంద్రుడు అంటుంటారని సంతోష పడకండి. వాళ్ళల్లాగా కాకుండా ఓ తండ్రిగా వాణ్ణి దార్లో పెట్టండి. అసలు మీ యిద్దరూ మాట్లాడుకోడమే అపురూపం. మీరేం పట్టించుకోరని వాడి ధీమా... ఏం మాట్లాడుతారో, ఎలా మాట్లాడుతారో మరి...... ఎనిమిదిన్నరకి ట్యూషన్ నుంచి వస్తాడు. ఈ లోపలే వచ్చేయండి. పిల్లాడు చేయి జారితే.... వాడి జీవితం పగిలినట్లే లెక్క. ఆ తర్వాత అతుకులెయ్యలేమే...." అంటూ గొడుగుని అందించింది.

నిజమే.... మార్చాలి. జీవితాన్ని అర్థం చేసుకున్న వాళ్ళకే సాఫీగా బండి సాగడం లేదు. తెలిసీ తెలియని వయసులో ఉన్నాడు.

## ఆకాశం కేసి చూస్తుందా చెట్టు

మనుషులు బలవంతులే !
అమ్మను వోడించాలని ఆశలతో బతుకుతారు
జయం సర్వదా అభిలషణీయమా ?
నిలువెల్లా తృప్తి నింపగలిగేదే కదా జయమంటే !

మనుషులు బలవంతులే !
వూరును ధ్వంసం చేసి విజేతలమనుకుంటారు
విజయమెక్కడున్నది ?
మనసో సంస్కార కలశమైనప్పుడే కదా !

మనుషులు బలవంతులే !
ఆడవాళ్లను హింసించి లొంగారనుకుంటారు
లొంగుతున్నదెవ్వరు ?
అమేయ ప్రయోజనాలు ఆశించే వాళ్లు కదా !

మనుషులు బలవంతులే !
కాళ్ళకింద నేల తమకు లొంగుతున్నదనుకుంటారు
లోబడుతున్నదెవ్వరు ?
తామేంటో తమకే స్పష్టంగా తెలిసిన వాళ్లే కదా !

మనుషులు బలవంతులే !
జ్ఞానం మిరుమిట్లకు శలభాలై పోకుంటే
జ్ఞానమెప్పుడైనా కాల్చే దీపమౌతుందా ?
వెలుగులు వెదజల్లడమే ప్రతి దీపానికి యిష్టం !

ఎదగడమొక కోరికా ?
ఆకాశం కేసి కదా చూస్తుందా చెట్టు !
భాషున్నదెందుకని ?
మౌనం శక్తెంతో తెలియజెప్పడానికే !

మనుషులు బలవంతులు
సృష్టించగలిగే వాళ్లకు సాధనమైనప్పుడు !
వాళ్ల వొడిలో వొద్దిగ్గా వొదిగిపోయినప్పుడు !

- విద్యాసాగర్ అంగళకుర్తి

జీవితం అంటే ఏమిటో సరిగా అర్థం చేసుకోలేని వయసు. వాడి భాష మారాలి.

ప్రపంచానికంతటికీ ఓ కామన్ భాష ఉంది. ఒకళ్ళ మీద ఒకళ్ళు ఆధారపడడం లోంచి వచ్చిన భాష. వర్షానికి మేఘానికి ఉన్న భాష. నేలకి వాన చుక్కలకి ఉన్న భాష. గాలికి, పూలకి ఉన్న భాష. ఆ భాషే లేకపోతే బంధా లేవిటి, బాంధవ్యాలేమిటి? సంబంధాలేమిటి?

నాకూ, రాఘవ మధ్య ఉండాల్సిన భాష యిప్పుడు తండ్రీ కొడుకులదా! సాటి మనిషిని, ఆ వయసువాడి తత్వాన్ని అర్థం చేసుకునే మానవభాష! వందరూపాయలు గుర్తు చేసిన భాష.

రాజారావు సెకండ్ షిఫ్ట్. ఈ టైంలో ఉంటాడు. రోజుకోసారైనా రాజారావు దగ్గరి కెళ్ళకపోతే ఉమా మహేశ్వర్రావుకి తోచదు. ఆలోచనలు, భావాలు ఒకటే వేవ్‌లెంత్.

రాజారావు పనిచేసే విభాగం సెపరేట్‌గా, ఓ మూలగా ఉంటుంది. అక్కడ జనరల్‌గా మనుష్య సంచారం తక్కువ.

అటూ యిటూ చెట్లు మధ్యలో సన్నటి సిమెంట్ దారి. చామంతులు విరగబూసిన పూల కుండీలు వరసగా ఉన్నాయి. మరో రోజయితే కురిసే వానలో తడుస్తూ తేమగాలిని ఎంజాయ్ చేస్తూ వెళ్ళేవారు. ఇవాళ ప్రకృతిని చూసి, పట్టించుకునే స్థితిలో లేరు.

దార్లోనే రాజారావు కనపడ్డాడు.

"నా కోసమేనా !"

తలూపారు గొడుగుని ఓ పక్కగా వంచి.

"అర్జంటుగా వెళ్ళాలి. ఏక్సిడెంట్, ఇద్దరు పోయారట...... నీకు తెలుసు కదా ! ఇలాంటి కేసులెంత ముఖ్యమో ! డాక్టర్ నిరంజన్ నేనూ వెళ్తున్నాం. నువ్వు కూచుంటే కూచో....... నువ్వు చదవలేదన్నావని 'ఆల్ కెమిస్ట్' తైత్తరీయోపనిషత్తు వివరణ లోపల పెట్టాను......"

"నీతో మాట్లాడాలిరా!"

వేగంగా ముందుకు వేసిన అడుగును అంతే వేగంతో వెనక్కి వేసి ఉమామహేశ్వర్రావు మొహంలోకి చూసాడు.

"ఏదైనా సీరియస్ విషయమా!"

అవునన్నట్లు తలూపారు.

"అయితే నేను వచ్చేవరకూ ఉండు. ఇక్కడే ఐ.సి.యూలోనే ఉన్నారు.... మా పని తొందరగానే అయిపోతుందిలే...." భుజం తట్టి, ఓసారి చిన్నగా నొక్కి వెళ్ళిపోయాడు.

ఉమామహేశ్వర్రావు రాజారావు విభాగంలోకి వెళ్ళడానికి ఉన్న నాలుగు నల్లటి గ్రానైట్ మెట్లు ఎక్కి, గొడుగుని గాజు తలుపులకి, లోపలివైపు ఓ మూలగా పెట్టారు.

లోపలి గదిలోకి వెళ్ళి, నిలువు వెనీషియన్ బ్లైండ్స్‌ని, మందపాటి కర్టెన్ జరిపి కూర్చుని కిటికీ వైపు జరుపుకుని గాజు కిటికీ లోంచి బయటికి చూస్తూండిపోయారు బ్లాంక్ అయిన మనసుతో.


లైట్ల కాంతిలో, జారుతున్న వాన చుక్కలతో వాలిపోయి ఊగుతున్న బోగన్ విల్లా ఆకుల్ని, పువ్వుల్ని చూస్తూ ఎంత సేపున్నారో ఆయనకే తెలీదు.

నిశ్శబ్దంగా ఉన్న ఆ గదిలో అడుగుల శబ్దం అలికిడి విని ఈలోకంలోకి వచ్చారు.

ఏ సిస్టర్, ఏ బ్రదర్, కాంటీన్ పిల్లాడు ఎవరైనా కావచ్చు. అందుకని చూడడానికి ప్రయత్నించలేదు,

అడుగుల సవ్వడి యింకొంచెం దగ్గరయింది.

రాజారావు అయితే కాదు. రాజారావే అయితే, మామూలుగా రాడు. సారీ, లేట యిందా! ఏం చేస్తున్నావ్? యిలాంటివి ఏదో అంటూ వస్తాడు.




దగ్గరగా.. బాగా దగ్గరగా వచ్చి ఆగాయి అడుగులు.

భుజాల మీదుగా, తల తిప్పి పక్కకి చూసారు.

సగం సగంగా కనపడ్డ ఎప్పుడూ చూడని మనిషి. యింత లోపలికి ఎందు కొచ్చాడు, అని అనుకుంటూ ఆశ్చర్యంగా కుర్చీతో సహా జరుపుకున్నారు, ఆ అబ్బాయిని సరిగ్గా చూద్దామని.

తడిసిన ఊసల్లాంటి జుట్టు, వెలసిన నీలం టీ షర్టు, నల్ల పాంటుతో ఓ సన్నటి యువకుడు.

" ముందు లాకర్ తెరు...." అంటూ కళ్ళని, తలని క్రూరంగా మూసి ఉన్న గదికేసి తిప్పాడు.

ఆయనకాపదాలు గ్రీకు లాటిన్‌లా అనిపించాయి.

"తాళం చేతులియ్యి లేదా లాకర్ తెరు....."

ఎమెచ్యూర్ దొంగ అని అనిపించింది ఆయనకి.

గబుక్కున టీ షర్టు పైకి ఎత్తి పాంటులో దాచిన కత్తిని తీసాడు.

మందంగా ఉన్న కర్టెన్ల వల్ల లోపల ఏం జరుగుతున్నది బయటవాళ్ళెవరికీ కనపడదు.

కత్తితోభుజం మీద గుచ్చాడు.

ఆశ్చర్యంగా ఆ అబ్బాయి మొహంలోకి చూసాడు.

ఇంత చిన్నవాడు.... ఎంతకి తెగిస్తున్నాడు ! ఆఖరికి కత్తి తీసి పొడవడానికి కూడా సిద్ధపడ్డాడు కదా! ఎవరిది తప్పు? చిన్న వయసులో గమనించని తలిదండ్రులదా! పరిస్థితుల ప్రభావమా ! పరిసరాల ప్రభావమా!

అలా చూస్తుంటే.... చూస్తుంటే.... రాన్రాను... ఆ అబ్బాయి మొహంలో రాఘవ కనిపిస్తున్నాడు.

రాఘవ భవిష్యత్తు ఆ అబ్బాయిలో కనిపిస్తోంది.

మళ్ళా భుజం మీద పొడిచాడు. ఈసారి చేత్తో. అయినా ఆ చేతుల్లో ఎంత బలం !

వాస్తవంలోకి వచ్చారు.

"లాకర్ తియ్యి."

"లాకరా ! లాకరేమిటి?"

" ఏం తెలీనట్లుండకు. బయట బాంక్ అని బోర్డుంది. బాంక్‌లో లాకర్లుండవా!

లాకర్‌లో డబ్బులుండవా ! అదీ.... ఆ డబ్బు... అందుకే లాకర్ తియ్యి...... తొందరగా....." అంటూ ఎడం చేతి పిడికిలితో డొక్కలో ఒక్క పోటు పొడిచాడు. పదునైన చేతిభాష.

"అబ్బా !" అంటూ వంగారు. మెల్లగా నిటారుగా నుంచున్నారు. కళ్ళల్లో సన్నటి, పల్చటి నీటి తెర. ఆ పిల్లాణ్ని చూసినప్పుడల్లా రాఘవ గుర్తుకొస్తున్నాడు.

ఉమామహేశ్వర్రావు ఏం మాట్లాడక పోయే సరికి, వాడకి యింకా ధైర్యం వచ్చింది.

"లాకర్ తీసేస్తే, నాక్కావలసినది తీసుకెళ్ళిపోతాను." ఆయన పెదవులమీద చిరునవ్వు.

చిన్నపిల్లాడి అజ్ఞానాన్ని చూసినవ్విన నవ్వు అది.

"నిజమే బాబూ, ఆ లాకర్‌లో ఉన్నది నీకే. నీలాంటి వాళ్లకే దాని అవసరం. నీకు సరిగ్గా సరిపోతుంది...." శాంతంగా అన్నారు.

"మాట్లాడకు" అంటూ తలుపు వైపుకి బలంగా, ముందుకు తోసాడు. తమాయించు కుని నిలబడ్డాడు.

"తలుపు తీస్తాను. అందులో అపు రూపంగా దాచినది తీసుకో... ఎవరికి ఏ విధంగా ఉపయోగపడ్తుందో అని చాలా జాగ్రత్తగా కాపాడుతుంటాం. అర్ధరాత్రి, అపరాత్రి, ప్రకృతి సహకరించినా, సహకరించక పోయినా విలువ కట్టలేని వాటిని తెచ్చి ఆ తలుపుల వెనకాల దాచుతాం."

ఈ లోపల రాజారావు తన చేతిలో ఉన్నది దాచడానికి లోపలికొచ్చాడు.

పరిస్థితిని వివరించకుండానే అర్థం అయిపోయింది.

"బాంక్ కొల్లగొడదామనుకున్నావా! దా ! దానివిలువ నువ్వు కట్టగలవేమో.... దా... ఆ అమూల్యమైనది ఏమిటో చూస్తావా ! రా చూద్దువు కానీ....." అంటూ నీళ్ళలాంటి పల్చటి ద్రవంలో ఉన్న కార్నియాని చూపించాడు రాజారావు.

ఒక్క క్షణం శిలలా అయిపోయాడు. ఆ క్షణంలోనే అంతా అర్థం అయిపోయింది. ఆ క్షణంలోనే నిశ్శబ్దం అందించిన భాష.

"ఎంత అమాయక దొంగవి. బయట బాంక్ అని ఉన్నది చదివి అర్థం చేసుకున్నావు కానీ, దాని ముందున్న కన్ను బొమ్మని అర్థం చేసుకోలేకపోయావు. నిజంగా నువ్వు సరి అయిన చోటుకే వచ్చావు. అంధకారంలో ఉన్న నీకు బాహ్యనేత్రాలు, మంచి ఏదో తెలుసు కోగలిగే, చూడగలిగే నేత్రాలు కావాలి. ఉన్నవి వివక్షత లేనివి కదూ...." అంటూ ఆ అబ్బాయి కళ్ళల్లోకి చూసారు ఉమామహేశ్వర్రావు.

"క్షమించండి" భాష మర్చిపోయిన పిల్లాడిలా తల వంచుకుని వెళ్ళిపోయాడు.

ఉమామహేశ్వర్రావు గొడుగు అందు కుంటూ రాజారావు వైపు చూసారు.

"చెప్పేవాళ్ళు లేకపోతే యిలాగే చెడి పోతారు....." అవును. పెద్దవాళ్ళు బాధ్యతల్ని మర్చిపోతే..... యిదిగో... యిలాగే ఉంటుంది.......

ఆ అబ్బాయి తన బాధ్యతని గుర్తు చేసాడు. రాఘవని ఈరోజు మార్చకపోతే రేపు వాడు ఏం అవుతాడో, ఏం అవడానికి అవ కాశం ఉందో ప్రాక్టికల్‌గా చెప్పాడు.

తన భాష మారాలి. తండ్రి భాష, ఓ స్నేహితుడి భాష, శిష్యుడికి ఉపదేశించే గురువు భాష.... దారి తప్పుతున్న వాడికి దిక్సూచి లాంటి భాష ఉండాలి. కమ్యూనికేషన్ అదే విధంగా జరగాలి.

తేలికపడ్డ మనసుతో బయటికి నడిచారు.

తోటకూర పెరగకుండా, వృక్షం కాకుండా చెయ్యగలనన్న నమ్మకం గుండెనిండా ఉన్న మనిషి ఆయన యిప్పుడు.




17-1-2007న విజయనగరం లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో జరిగిన ఛాసో స్ఫూర్తి 13వ పురస్కార ప్రదానోత్సవ సభలో డా॥చాగంటి తులసి 'సాహితీ తులసి' వ్యాస సంపుటి ఆవిష్కరణ. చిత్రంలో కె.కె.రంగనాధాచార్యులు, శ్రీమతి జాజుల గౌరి, డా॥ నమమాస స్వామి, డా॥ రామసూరి, డా॥తులసిలు ఉన్నారు.




గ్రంథాలయ వికాస సమితి ఆధ్వర్యంలో బందరు టౌను హాలులో జరిగిన కీ॥శే. పాతూరి నాగభూషణం శతజయంతి ఉత్సవ సభలో ప్రసంగిస్తున్న డా॥రావి శారద. వేదికపై శ్రీసోమూరి కృష్ణాజీరావు, డా॥మాదిరాజు రామలింగేశ్వరరావు, సమితి అధ్యక్షులు దొండపాటి దేవదాసు, గుత్తికొండ సుబ్బారావులు ఉన్నారు.